గీ. దశరథ మహీవిభుండు యథావిధిగ నొ
నర్చి సుతులకు చౌలోపనయన విధులు
శాస్త్ర పారంగతులచేత సకల విద్య
తెలివిఁ జెప్పించి బుద్ధిమంతులను జేసె. 3

ఉ. అంతట గాధినందనుఁడు యాగము లన్నియు రాక్షసాధముల్
పంతము బూని సారెకును భంగము జేయఁగ దానిమాన్ప భూ
కాంతుని రామలక్ష్మణులఁ గొసరిఁ బంపు మటంచు వేడ న
త్యంతభయంబునొంది యతఁడంపె మునీంద్రుని వెంటఁ బుత్రులన్. 4

చ. మునివరుఁ డంత సత్కథల బోధలు సేయుచు రామలక్ష్మణుల్
వనమునఁ బోవుచున్నను లవంబు శ్రమంబును గల్గనీక పం
బిన కృపచే బలాతిబల విద్యల నేర్పుచు నేగుచుండఁగా
దనుజకుల ప్రభూతయగు తాటక వారల నడ్డగింపఁగన్. 5

క. జగ దపకారిణి యని యెం
చి గురుఁడు గాధిసుతునాజ్ఞఁ జేకొని దానిన్
మగువ యటంచును జంకక
తెగటార్చెను రామవిభుఁడు తేజ మెలర్పన్. 6

శా. నారాచంబుల జృంభకాదుల మహాసంఘంబునం గౌశికుం
డారాజన్యుల కిచ్చి యాశ్రమమునన్ యజ్ఞవ్రతం బూనఁగా
ఘోరాకారులు తాటకాసుతులు సంక్షోభంబుఁ గావించి రా
మారీచుండు సుబాహుఁ డిర్వురు నసృఙ్మాంసాద్రి వర్షంబులన్. 7

మ. అనుమానింపక మారుతాస్త్రమున రామాఖ్యుండు మారీచునిన్
వనధిన్ దోసి సుబాహుముఖ్య దనుజవ్రాతంబు నొక్కుమ్మచే
దునుమన్ యజ్ఞసమాప్తిఁ జేసి మునిచంద్రుం డాత్మనుప్పొంగి సీ
తను శ్రీరామునిఁ గూర్పనెంచి మిథిలన్ దర్శింపఁగానేగినన్. 8

క. అని వాయుసుతుఁడు బల్కినఁ
దనుజేంద్రుఁడు వానిఁ జంపఁ దలఁపఁగ దూతన్
జనదు వధింపఁగ వీరుల
కనుచు విభీషణుఁడు బల్కె న్యాయముగాఁగన్. 22

గీ. రావణుఁడు వాలమునకు వస్త్రములు జుట్టి
తైలమున ముంచి యగ్ని తప్తంబు సేయు
టెఱిఁగి సీత పతివ్రతనేని నేను
పవనసుతుఁ గాల్పవలదని వహ్ని వేఁడె. 23

చ. అనలుఁడు లూమలోమమునునైన దహింపక వెల్గుచుండఁ బా
వని కడు సంతసించి నిజబంధములన్ దెగఁ ద్రుంచి దైత్యులన్
బనిఁగొని చంపుచున్ బురము భస్మము సేయుచు వాలవహ్ని చే
జనకజకున్ సమస్కృతులు సల్పి సముద్రముదాటి వెండియున్.

ఉ. సేమము సీతకంచుఁ గపిసేనకు మారుతి తెల్పినంత చే
తోముదమంది వానరులు తోకలఁ ద్రిప్పుచు గంతు లేయుచున్
రామున కీప్రవృత్తి నచిరంబుగఁ దెల్పుద మంచు వాలిజా
జ్ఞా మదమత్తులై మధువనంబునఁ దేనెలఁ గ్రోలుచుండఁగన్. 25

క. వనపాలకుఁడు దధిముఖుఁడు
గని వారల నడ్డగింపఁగా భూరిదంతా
ది నిజావయవములఁ బ్రద
ర్శనమును గావించి గేలి సలుపుచుఁ గపులున్. 26

గీ. పాదములచేతఁ దన్నుచుఁ బండ్లచేతఁ
గొరుకుచును జీల్చి వేయుచు గోళ్ల చేత
బాహువులచే చపేటముల్ బరపి వాల
దండములచేతఁ దరిమిరి పిండిఁ జేసి. 27

చ. శరములచేతఁ ద్రుంచినను జావక వెంటనె మాటిమాటికిన్
శిరములు బుట్టుచుండ సరసీభవాస్త్రముచేత రావణా
సురునిఁ ద్రిలోకకంటకుని శూరునిఁ ద్రుంచెను రామచంద్రుఁ డం
బరమున భేరికాధ్వనులు బర్వ సురల్ సుమవృష్టిఁ జేయఁగన్. 25

క. దనుజులు నిర్మూలంబై
రని విని మండోదరీ ముఖాంగనలు గతిం
చిన పతులను సుతులను గను
గొనుచున్ విలపించి రపుడు ఘోరముగాఁగన్. 26

చ. రణ మొనరించి విశ్రుతపరాక్రముఁడౌ నిజసోదరుండు రా
వణుఁడు దివంబుఁ జేర రిపుభావము నెంతయుఁ బాసి యాత్మదూ
షణ మొనరించి దుఃఖమయ సాగరమందు మునింగి యావిభీ
షణుఁడటఁ బారలౌకికము సల్పె యథావిధి భక్తియుక్తుఁడై. 27

క. అపుడు విభీషణు లంకా
ధిపతిని గావించి యగ్నిదేవునిచే సీ
త పవిత్రురా లనుచుఁ దెలి
సి పరిగ్రహణంబుఁ జేసె శ్రీరాముఁడటన్. 28

ఆ. కపులఁ గూడి పుష్పకవిమానయానుఁడై
సేతు బంధనాది చిత్ర కథల
సీతతోడఁ దెల్పి చేరె భరద్వాజు
నాశ్రమంబు దశరథాత్మజుండు. 29

చ. భరతుఁడు సైన్యయుక్తుఁడయి వత్సవియుక్తనవప్రసూతసం
తరళగవీసమానలగు తల్లులఁ గూడి వశిష్ఠుఁడున్ మునీ
శ్వర యుతుఁడై-యెదుర్కొనఁగ సర్వశుభావహతూర్యనాదముల్
బరవనయోధ్యఁజేరెరఘువంశలలాముఁడురాముఁడయ్యెడన్. 30

